సాక్షి ఒడిశా

మంగళవారం । 29 । ఆగస్టు । 2023



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ. 4,65,982
బంగారం	1 గ్రాము 420 మిల్లీ గ్రాములు
వెండి	7 గ్రాముల 100 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



మూడో రైలు మార్గం

బారంగ్, ఖుర్దా రోడ్డు మార్గంలో త్వరలో మూడో రైలు మార్గం రానుంది. ఈ మేరకు పనులు శరవేగంగా సాగుతున్నాయి.

- 8లో



అగ్రగామిగా నిలుపుదాం

దేశాన్ని అగ్రగామిగా నిలపాల్సిన బాధ్యత యువతపై ఉందని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు.

- 8లో

న్యూస్‌రీల్

పాముకాటుతో బాలిక మృతి



చిన్నారి మృతదేహం వద్ద నాన్నమ్మ

మల్కన్‌గిరి: కలిమెల సమితి పోట్టేరు పోలీసు స్టేషన్ పరిధిలో బోధిలి పంచాయతీ నూవగుడ గ్రామంలో పాముకాటుతో బాలిక మృతిచెందింది. బిజులి తెల్లం(11) చిన్నప్పుడే తల్లిదండ్రులు మృతి చెందడంతో పెదనాన్న ఇంటి వద్ద ఉంటోంది. సోమవారం పొలంలో గడ్డి తీసేందుకు పెదనాన్నతో కలిసి వెళ్లింది. అక్కడ విష సర్పం కాటు వేయడంతో స్పృహ కోల్పోయింది. నోటి నుంచి నురగ రావడంతో కలిమెల ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహానికి కలిమెల ఆరోగ్య కేంద్రంలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. బిజులి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రోడ్డు నిర్మించాలని వినతి



అధ్వానంగా సాయినగర్ రోడ్డు

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని చైనా మార్కెట్‌లో షిర్డీసాయి మందిరం సమీపంలో సాయి నగర్ వద్ద రోడ్డు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ మేరకు సోమవారం ఎమ్మెల్యే సదాశివ ప్రధానిని కలిసి సమస్య విన్నవించారు. మొదటి లైన్‌లో సగం రోడ్డు నిర్మించి వదిలేయడంతో కొద్దిపాటి వర్షమొచ్చినా బురదమయంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే స్పందిస్తూ త్వరలోనే రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

పీఎఫ్ సందేహాల నివృత్తి



మాట్లాడుతున్న ఎన్‌ఫోర్సుమెంట్ అధికారి ప్రభాత్‌కుమార్ మహారాణా

పర్లాకిమిడి: స్థానిక వికాస్ విద్యానికేతన్‌లో ఆదివారం బరంపురం ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ అధికారులు నిధి ఆప్‌కే నికత్ 2.0 కార్యక్రమం నిర్వహించారు. ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు రిటైర్‌మెంట్ అయిన తర్వాత ఆన్‌లైన్‌లో పెన్షన్‌కు ఎలా దరఖాస్తు చేసుకోవాలో ఎన్‌ఫోర్సుమెంట్ అధికారి ప్రభాత్‌కుమార్ మహారాణా వివరించారు. ఉద్యోగుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో వికాస్ విద్యానికేతన్ సెక్రటరీ లాల్ మోహన్ ఆచార్య తదితరులు పాల్గొన్నారు.

కిషోర్ జెనాకు రూ.25 లక్షల నగదు పురస్కారం



జావెలిన్ త్రో పోటీలో కిషోర్ జెనా

భువనేశ్వర్: ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ ఫైనల్స్‌లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించిన రాష్ట్రం నుంచి మొదటి వ్యక్తిగా నిలిచిన ఒడిశా జావెలిన్ స్టార్ కిషోర్ జెనాకు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రత్యేకంగా అభినందిచారు. ఈ సందర్భంగా రూ. 25 లక్షల నగదు పురస్కారం ప్రకటించారు. కిషోర్ జావెలిన్ త్రోయింగ్‌లో అద్భుతమైన నైపుణ్యాన్ని ప్రదర్శించి ఫైనల్ పోటీలో 5వ స్థానంలో సాధించాడు. బుడాపెస్ట్‌లో జరిగిన ఈవెంట్‌లో 84.77 మీటర్ల త్రో ప్రదర్శనతో పర్సనల్ బెస్ట్ స్కోర్ చేశాడు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ కిషోర్ జెనా అద్భుతమైన ప్రయాణం, అసాధారణ ప్రదర్శన రాష్ట్రానికి, దేశానికి కీర్తిని తీసుకురావడమే కాకుండా వర్ధమాన క్రీడాకారులకు స్ఫూర్తినిస్తుందని అభినందించారు.

• శివోహం



శ్రావణమాసం ఆఖరి సోమవారం సందర్భంగా శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక చెక్కాగుడ ప్రేమ్‌పహాడ్ వద్ద శివమందిరం, బిసంకటక్ సమితి చాటికొన వద్ద పాతాలేశ్వర మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివలింగానికి అభిషేకాలు చేశారు. – రాయగడ

• విజయానందం

స్వయం స్వపరిపాలన దినోత్సవం నేపథ్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నీలో బరంపురంమున్సిపల్ కార్పొరేషన్(బీఎంసీ) జట్టు విజేతగా నిలిచింది. సోమవారం జరిగిన ఫైనల్ పోరులో బరంపురం మీడియా–11పై సమష్టిగా పోరాడి విజయకేతనం ఎగురవేసింది. – బరంపురం



• చెట్టు కింద చదువులు



అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నా అధికారుల నిర్లక్ష్యం వల్ల కార్యరూపం దాల్చలేదు. దీంతో చిన్నారులు, నిర్వాహకులకు ఇబ్బందులు తప్పడం లేదు. జయపురం సబ్‌డివిజన్ కుంద్రా సమితి కెరమెట గ్రామ పంచాయతీ బారబంద అంగన్‌వాడీ కేంద్రానికి వసతి సౌకర్యం లేక చెట్టు కిందే చిన్నారులకు ఆటపాటలు నేర్పిస్తున్నారు. – జయపురం

నిరసనలు.. నినాదాలు

- పర్లాకిమిడిలో మైనారిటీల నిరసన ప్రదర్శన
- కొరాపుట్ జిల్లాలో బీజేపీ నేతల ఆందోళన
- రాయగడంలో పంచాయతీ విధులు బహిష్కరించిన అధికారులు



రాయగడ: పీఈఓల దీక్షా శిబిరంలో ఎమ్మెల్యే ముదులి



పర్లాకిమిడి:గజపతి జిల్లా కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్తున్న మైనారిటీ సంఘాల సభ్యులు



పర్లాకిమిడి:అదనపు జిల్లా మేజిస్ట్రేట్ రాజేంద్రమింజ్‌కు వినతిపత్రం అందిస్తున్న క్రిస్టియన్, ముస్లిం మతపెద్దలు



జయపురం: పంచాయతీ అవినీతిపై మాట్లాడుతున్న బీజేపీ నేత గౌతమ్ సామంతరాయ్

పర్లాకిమిడి: మణిపూర్ ఘటనలో క్రిస్టియన్, ముస్లిం మైనారిటీల మృతికి నిరసనగా పాత కోర్టు వద్ద చర్చి నుంచి కలెక్టరేట్ వరకు సోమవారం ర్యాలీ నిర్వహించారు. గజపతి యునైటెడ్ క్రిస్టియన్ ఫోరం అధ్యక్షుడు రెవరెండ్ జోసెఫ్ భయ్యామఝి, డాక్టర్ పల్లబ్ లిమ్మా, బికాస్ ప్రధాన్, డాక్టర్ ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో ఈ ర్యాలీ జరిగింది. వేలాది మంది క్రిస్టియన్లు, ముస్లింలు గజపతి కలెక్టరేట్ వద్దకు చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా అదనపు మేజిస్ట్రేట్ రాజేంద్ర మింజ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించాలని కోరారు. కార్యక్రమంలో జుమ్మా మసీదు (బరంపురం) ప్రెసిడెంట్ మహమ్మద్ ఫైజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్లు పరిష్కరించాలి..

రాయగడ: తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ కార్యనిర్వాహక అధికారులు (పీఈఓ) సోమవారం ఆందోళనకు దిగారు. విధులు బహిష్కరించి డీఆర్‌డీఏ కార్యాలయం సమీపంలో నిరసన దీక్ష చేపట్టారు. డిమాండ్లు పరిష్కరించే వరకు ఆందోళన కొనసాగుతుందని పీఈఓ సంఘం అధ్యక్షుడు సుభాష్ చంద్రకర్, సాధారణ కార్యదర్శి కమలాకాంత్ పండా స్పష్టం చేశారు. ప్రభుత్వానికి అనేక సార్లు విన్నవించినా పట్టించుకోకపోవడంతో తప్పనిసరి పరిస్థితిలో విధులు బహిష్కరించాల్సి వచ్చిందని తెలిపారు. పీఈఓల నియమకాలో ప్లస్–2 కు బదులుగా ప్లస్–3 ఉత్తీర్ణులైన వారినే అర్హులుగా గుర్తించి నియమించాలని, పే లెవెల్–5లో చెల్లిస్తున్న వేతనాలు రూ.21,700కు బదులు పే లెవెల్–9 ప్రకారం రూ.35,400 చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. కాగా, దీక్షా శిబిరానికి రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి సందర్శించి ఉద్యోగులకు సంఘీభావం ప్రకటించారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీఇచ్చారు.

జయపురం: రాష్ట్ర ప్రభుత్వ అవినీతి పాలనపై బీజేపీ నేతలు ఆందోళనకు దిగారు. జయపురం సమితి పంపుణి గ్రామ పంచాయతీ అవినీతికి నిలయమైందని ఆరోపిస్తూ కొరాపుట్ జిల్లా బీజేపీ నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర శాశ్వత కార్యవర్గ సభ్యుడు గౌతమ సామంతరాయ్ మాట్లాడుతూ అభివృద్ధి పనులకు మంజూరవుతున్న నిధులు దారి మళ్లుతున్నాయని ఆరోపించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజనలో అర్హులను కాదని అనర్హులకు ఇళ్లు మంజూరు చేస్తున్నారని దుయ్యబట్టారు. స్వచ్ఛభారత్ యోజనలో భాగంగా మరుగుదొడ్లు నిర్మించకుండానే అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపణలు గుప్పించారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల పింఛన్లలో అక్రమాలు జరుగుతున్నాయని ధ్వజమెత్తారు. ప్రధాన మంత్రి గరీబ్ పథకంలో నిరుపేదలకు ఇస్తున్న బియ్యం పంపిణీలోనూ అవినీతి చోటుచేసుకుందన్నారు. కార్యక్రమంలో పార్టీ జయపురం మండలి అధ్యక్షుడు దీనబంధు ప్రధాన్, పట్టణ అధ్యక్షుడు సుమంత ప్రధాన్, నళినీ కుమార్ దాస్, జనార్ధన్ మండల్, ప్రమోద్ చౌధురి తదితరులు పాల్గొన్నారు.

ప్రేమతో మీ సోదరి..!

- ప్రధానమంత్రికి రాష్ట్ర మహిళ రాఖీ
- మన్ కీ బాత్ ప్రశంసలతో ప్రేరణ



వ్యర్థాలతో తయారు చేసిన రాఖీతో కమల మహరణ



ప్రధాన మంత్రికి పంపిణీ రాఖీ

భువనేశ్వర్: నిరుపయోగం నుంచి సద్వినియోగ ఉత్పాదనతో భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నుంచి ప్రశంసలు అందుకున్న మహిళ ఈ ఏడాది రాఖీ పూర్ణిమ పురస్కరించుకుని తనదైన శైలిలో పునర్వినియోగ ప్రక్రియలో తయారు చేసిన రాఖీని ప్రధానికి పోస్టల్ ద్వారా పంపించారు. కేంద్రాపడా జిల్లా కపాలేశ్వర్ పంచాయతీ ఖొయిరాబాద్‌కు చెందిన కమల మహరణ స్వయంగా తయారు చేసిన రాఖీని ప్రధానికి పంపించారు. వ్యర్థ పదార్థాలను వినియోగానికి అనుకూలంగా మలిచి ఈ రాఖీని తయారు చేయడం విశేషం.

ఆ కార్యక్రమమే ప్రేరణ..

నిరుపయోగం, వ్యర్థ పదార్థాల నుంచి అద్భుత పునర్వినియోగ సామగ్రి తయారు చేస్తున్న కమల మహరణను ప్రధాని ఆరు నెలల కిందట మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రశంసించారు. ఈ సందర్భంగా ప్రధాని ఆమెని సోదరిగా సంబోధించారు. తన పట్ల ఇంతటి ఆదరణ ప్రదర్శించడంతో ప్రధాన మంత్రిని తోబుట్టువుగా పరిగణించి ఈ ఏడాది రాఖీని తానే స్వయంగా తయారు చేసి పంపించినట్లు తెలిపారు. పూసలు, జరీ, ప్రత్యేక దారపు పోగులుతో తయారు చేసిన ఈ రాఖీని హృదయపూర్వకంగా స్వీకరిస్తారని కమల ఆశాభావం వ్యక్తం చేశారు.

వ్యర్థం నుంచి పునర్వినియోగం..

పాల ప్యాకెట్ల కవర్లు, ఇతర వ్యర్థ వనరుల నుంచి కమల మహరణ ఆకర్షణీయంగా బుట్టలు, మొబైల్ స్టాండ్లు, వస్తువులను తయారు చేస్తూ ప్రత్యేకతగా నిలుస్తున్నారు. స్వయం సహాయక బృందంతో కలిసి వ్యర్థాలను పునర్వినియోగంలోకి తెస్తున్నారు. వేస్ట్ టు వెల్త్ శీర్షికపై 98వ విడత మన్ కీ బాత్ కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ ఈ ఏడాది ఫిబ్రవరిలో మహరణను అభినందించారు.

930 కిలోల గంజాయి సీజ్



గంజాయిని సీజ్ చేసిన బరంపురం అబ్కారీ అధికారులు



మల్కన్‌గిరి జిల్లాలో గంజాయితో పట్టుబడిన నిందితులు

బరంపురం: బరంపురం నగర సమీపంలో మౌరి కాళువా ఘాట్ రోడ్ నుంచి బరంపురం నగరానికి వ్యాన్‌లో అక్రమంగా రవాణా చేస్తున్న 930 కిలోల గంజాయిని బరంపురం అబ్కారీ అధికారులు సీజ్ చేశారు. బరంపురం ఎక్సైజ్ అదనపు కమిషనర్ రాజేంద్రకుమార్ పాత్రో తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం బరంపురం పోలీసు జిల్లా దిగపండి పోలీసు స్టేషన్ పరిధి మౌరి కాళువా ఘాట్‌రోడ్ నుంచి బరంపురం నగరానికి వ్యాన్‌లో గంజాయి తరలిస్తున్నారన్న సమాచారం మేరకు బరంపురం అబకారి అధికారులు తనిఖీలు చేపట్టారు. అనుమానిత వ్యాన్‌లో పరిశీలించగా 930 కిలోల గంజాయి బస్తాలు గుర్తించారు. వ్యాన్ సీజ్‌చేసి డ్రైవర్‌ని అరెస్టు చేశారు. స్వాధీనం చేసుకున్న గంజాయి సుమారు రూ.44 లక్షలు ఉంటుందని ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

మల్కన్‌గిరి జిల్లాలో 50 కేజీలు..

మల్కన్‌గిరి: జిల్లాలోని బేజ్‌గూడ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా బైక్‌పై ఇద్దరు వ్యక్తులు అతి వేగంగా రావడంతో అనుమానంతో ఆపారు. తనిఖీ చేయగా బస్తాలో గంజాయి గుర్తించారు. ఇద్దరినీ అరెస్టు చేసి మల్కన్‌గిరి పోలీసు స్టేషన్ తరలించారు. పట్టుబడిన వారు రామచంద్ర పంగి, దేవుడు ఖిలోగా తేలింది. పద్మాగిరి గ్రామానికి గంజాయి తరలిస్తున్నట్లు గుర్తించారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.3లక్షలు ఉంటుందని మల్కన్‌గిరి ఐఐసీ రీగాన్‌కీండో తెలిపారు. నిందితుల నుంచి రూ.500 నగదు, బైక్, స్వాధీనం చేసుకున్నారు.

ప్రాణం దక్కాలంటే డోలీ మోయాల్సిందే!



అవంతిని మంచంపై మోసుకెళ్తున్న కుటుంబ సభ్యులు

మల్కన్‌గిరి: రహదారి సౌకర్యం లేక అంబులెన్స్ రాక ఓ మహిళను కుటుంబ సభ్యులు డోలీలో ఆస్పత్రికి తీసుకెళ్లాల్సి వచ్చింది. ఈ ఘటన కలిమెల సమితి తాండ్‌బై పంచాయతీ ఎం.వి.79 పోలీసుస్టేషన్ పరిధిలో నూవగూడ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామంలో నివాసముంటున్న అనాభు సున భార్య అవంతి సున(45)కు రెండు కిడ్నీలు పాడయ్యాయి. ఐదు నెలలుగా కిడ్నీ సమస్యతో బాధపడుతోంది. మూడు నెలలుగా మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రిలో డయాలసిస్ చేయించుకుంటోంది. సోమవారం పరిస్థితి విషమించడంతో ఆస్పత్రికి తరలించేందుకు కుటుంబ సభ్యులు అంబులెన్సుకు ఫోన్ చేశారు. అయితే నూవగూడకు రహదారి సౌకర్యం లేనందున అంబులెన్సు రాదని, కొద్దిదూరం మోసుకుని వస్తే వాహనం తీసుకొస్తామని సిబ్బంది చెప్పారు. దీంతో చేసేది లేక ముగ్గురు కుమారులు, భర్త మంచాన్ని డోలీగా చేసి మోసుకొచ్చారు. మైదాన ప్రాంతానికి వచ్చాక అంబులెన్సు ఎక్కించి ఆస్పత్రికి తరలించారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా..

పర్లాకిమిడి: జిల్లాలోని కాశీనగర్ సమితి శియ్యాలీ గ్రామ పంచాయతీ కార్యాలయంలో కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్ ఆధ్వర్యంలో గ్రామముఖి పరిపాలన, స్పందన కార్యక్రమం నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి 56 వినతులు వచ్చాయి. అందులో ఒక వినతిని కలెక్టర్ తక్షణమే పరిష్కరించారు.

గండాహాతి జలపాతం వద్ద తనిఖీలు



పర్యాటకుల కార్లను తనిఖీ చేస్తున్న పోలీసులు



గండాహాతి వద్ద మద్యపాన నిషేధ బోర్డు

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో ప్రఖ్యాతిగాంచిన గండాహాతి జలపాతం వద్ద ఆదివారం అటవీ, ఎక్సైజ్ శాఖ అధికారులు పర్యాటకుల వాహనాలను తనిఖీ చేశారు. ప్రకృతి సిద్ధమైన జలపాతం వద్ద కొందరు మద్యం బాటిళ్లు తెచ్చుకుని హల్‌చల్ చేయడం, ప్లాస్టిక్ వ్యర్థాలు పారబోస్తుండటంతో కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ ఇటీవల అనేక ఆంక్షలు విధించారు. ఈ నేపథ్యంలో ఆదివారం పర్యాటకులు తీసుకువచ్చిన మద్యం బాటిళ్లు, ప్లాస్టిక్ సంచులను స్వాధీనం చేసుకుని జరిమానా విధించారు. రాయఘడ బ్లాక్ తహసీల్దార్ లీలావతి ఆచార్య పర్యవేక్షించారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం


- ఎస్‌యూవీని ఈడ్చుకుపోయిన గూడ్సు రైలు



పారాదీప్ పోర్టు ప్రాంతంలో ప్రమాద దృశ్యం

భువనేశ్వర్: జగత్‌సింగ్‌పూర్ జిల్లా పారాదీప్ పోర్ట్ పరిసరాల్లో నిషేధిత జోనులో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. సోమవారం ఎస్‌యూవీ వాహనాన్ని గూడ్స్ రైలు కొంత దూరం వరకు ఈడ్చుకుపోయింది. ఈ సంఘటనలో ఎస్‌యూవీలో ప్రయాణిస్తున్న వారికి ఎటువంటి హాని జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ప్రాథమిక నివేదికల ప్రకారం.. బొగ్గుతో నిండిన గూడ్స్ రైలు ఎస్‌యూవీని ఢీకొని సుమారు 30 మీటర్ల దూరం వరకు ఈడ్చుకుపోయింది. నిషేధిత ప్రాంతం గుండా ఎస్‌యూవీ రైల్వే ట్రాక్ దాటుతుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఎస్‌యూవీ స్వల్పంగా దెబ్బతింది. గూడ్స్ రైలు నెమ్మదిగా కదులుతున్నందున పెను ముప్పు తప్పింది. ఇందులో ఉన్న వారంతా ఓ ప్రైవేట్ కంపెనీకి చెందిన సిబ్బంది. పారాదీప్ పోర్టు మెకానికల్ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ (ఎంసిహెచ్‌పి) క్యాంటీన్ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్‌యూవీ డ్రైవర్ అజాగ్రత్త కారణంగా ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు. సీఐఎస్‌ఎఫ్ సీనియర్ అధికారులు, పారాదీప్ పోర్ట్ ట్రాఫిక్ విభాగం ఘటనా స్థలాన్ని సందర్శించి రైలు పట్టాలపై నిలిచిన వాహనాన్ని తొలగించి పరిస్థితిని చక్కదిద్దారు.

వంశధారలో ఇద్దరు చిన్నారుల గల్లంతు



నదిలో గాలింపు చేపడుతున్న సిబ్బంది



నది ఒడ్డున ఎదురుచూస్తున్న కుటుంబీకులు

రాయగడ: జిల్లాలోని చంద్రపూర్ సమితిలో ప్రముఖ శైవక్షేత్రం మీనాజోలలో కొలువుదీరిన మీనకేశ్వరుడి దర్శనానికి వచ్చిన ఇద్దరు వ్యక్తులు సమీపంలోని వంశధార నదిలో సోమవారం గల్లంతయ్యారు. కంధమాల్ జిల్లా కొటాగుడ సమితి పరిధిలోని శ్రీరాంనగర్ గ్రామానికి చెందిన రత్నాకర్ బొడొనాయక్ (9), స్మృతి బొడొజెటి (10)లు ఆఖరి శ్రావణ సోమవారం సందర్భంగా మీనకేశ్వర దర్శనానికి కుటుంబ సభ్యులతో కలిసి వచ్చారు. దర్శనానంతరం సమీపంలోని వంశధార నదిలో స్నానానికి దిగిన రత్నాకర్, స్మృతిలు నదీ ప్రవాహానికి కొట్టుకుపోయారు. కుటుంబ సభ్యులు చంద్రపూర్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు భామిని, చంద్రపూర్‌లోని అగ్నిమాపక సిబ్బందికి తెలియజేశారు. నాలుగు గంటల పాటు గాలించినా ఆచూకీ దొరకలేదు.

వెల్లువెత్తిన వినతులు



వినతులు పరిశీలిస్తున్న అధికారులు

బరంపురం: జిల్లా పాలనా యంత్రాంగం ఆధ్వర్యంలో సబ్–కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌కు వినతులు వెల్లువెత్తాయి. కలెక్టర్ దివ్యజ్యోతి పరిడా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వందలాది మంది పాల్గొని సమస్యలు విన్నవించారు. మౌలిక సదుపాయాలు పరిష్కరించాలని వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సబ్–కలెక్టర్ ఆశీష్ కులకర్ణి, బరంపురం ఎస్పీ శర్వాణ్ వివేక్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చిలికా సరస్సులో చిక్కుకున్న పడవ



పడవపై ఉన్న ప్రయాణికులు

భువనేశ్వర్: పూరీ జిల్లా సతపడా సమీపంలో చిలికా సరస్సులో సోమవారం ఓ పడవ చిక్కుకుంది. అందులో 50 మంది ప్రయాణికులు ఉన్నారు. మోటారు వాహనాలు, సైకిళ్లు, ఇతర వస్తువులతో సతపడా నుంచి కృష్ణప్రసాద్ ప్రాంతంలోని జొహ్నాకుడొ ప్రాంతానికి వెళుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. సతపడా నుంచి అర కిలో మీటరు దూరం వెళ్లాక పడవ మొరాయించింది. సాంకేతిక సమస్యతో ఇలా జరిగినట్లు భావిస్తున్నారు. సమాచారం అందుకున్న యంత్రాంగం రంగంలోకి దిగి ప్రయాణికులను రక్షించేందుకు చర్యలు చేపట్టింది.

సారాబట్టీ ఏర్పాటు చేయవద్దు



ఎమ్మెల్యేను కలిసిన సనపిండపాదర్ గ్రామ యువకులు

జయపురం: తమ గ్రామంలో ఎట్టి పరిస్థితిలోనూ సారాబట్టీ ఏర్పాటు చేయవద్దని సనపిండాపాదర్ గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. జయపురం సబ్ డివిజన్ బొరిగుమ్మ సమితి బొరిగుమ్మ పోలీసు స్టేషన్ ప్రాంతంలోని ప్రభుత్వ నాటుసారా బట్టీని సనపిండాపాదర్ తరలించేందుకు నిర్ణయించినట్లు తెలియడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఈ మేరకు సోమవారం జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతిని ఆయన నివాసంలో కలిసి సమస్య వివరించారు. సారాబట్టీ తమ ప్రాంతాని వస్తే శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందని చెప్పారు. తక్షణమే ఆ ప్రయత్నాన్ని అడ్డుకోవాలని స్థానిక యువత కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ అధికారులతో మాట్లాడి బట్టీ రాకుండా చూస్తానని హామీ ఇచ్చారు.

440 లీటర్ల సారా స్వాధీనం



స్వాధీనం చేసుకున్న సారాతో ఎస్ఈబీ సీఐ ఉపేంద్ర, రూరల్ ఎస్ఐ సింహాచలం

పార్వతీపురంటౌన్: ఎమ్మార్‌నగరం సమీపంలో ఆటోలో తరలిస్తున్న 440 లీటర్ల సారాను పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి, ఒడిశాకి చెందిన ఆటోడ్రైవర్ కొండగొర్రి అజిత్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇదే ఘటనకు సంబంధించి, బలిజిపేట మండలానికి చెందిన వ్యక్తిపై కూడా నమోదు చేశామని పోలీసులు పేర్కొన్నారు.

'దాసరి'కి ఎస్వీఆర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు



తిరుపతినాయుడును అవార్డుతో సత్కరిస్తున్న దృశ్యం

విజయనగరం టౌన్: ప్రముఖ రంగస్థల నటుడు, విశ్రాంత తెలుగు పండిట్ దాసరి తిరుపతినాయుడుకు ఎస్వీ రంగారావు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు లభించింది. తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ నగరంలో రవీంద్రభారతిలో ఆ రాష్ట్ర ఇరిగేషన్ బోర్డు చైర్మన్ వేణుగోపాలాచారి చేతులమీదుగా ఆయన సోమవారం అవార్డును అందుకున్నారు. 1980లో నాటకరంగంలో ప్రవేశించి, 42 పౌరాణిక, సాంఘిక నాటకాలు, మరో 2,500 ప్రదర్శనలు ఇచ్చారు. 2013లో సినీరంగంలో ప్రవేశించి, ఇప్పటివరకు మొత్తం 16 సినిమాల్లో నటించారు. ఆయనకు అవార్డు రావడం పట్ల ఆయన స్వగ్రామం బాడంగిలోని కుటుంబ సభ్యులు, ఆనందం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు చెబుతున్నారు.

తెలుగు భాషా పరిరక్షణే ధ్యేయం

విజయనగరంటౌన్: తెలుగు భాషా పరిరక్షణే ధ్యేయమని వాగ్దేవి సమారాధనమ్, జై పైడిమాంబ వేద సంస్కృత పరిరరక్షణ సేవాసంఘం వ్యవస్థాపకులు పెన్నేటి స్వప్నహైందవి అన్నారు. తెలుగు భాషా వారోత్సవాల్లో భాగంగా స్థానిక గురజాడ స్వగృహంలో విద్యార్థులకు పద్యపఠనం, వ్యాసరచన, కథలు, కవితలు, క్విజ్‌పోటీలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పోటీలకు తొమ్మిది పాఠశాలల నుంచి 500 మంది విద్యార్థులు హాజరు కాగా, సీబీఎస్ఈ ఫోర్ట్‌సిటీ స్కూల్, స్టేట్ సిలబస్ ఫోర్ట్ సిటీ స్కూల్, అమర్ స్కూల్ విద్యార్థులు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు కైవసం చేసుకున్నారని పేర్కొన్నారు.

గుప్తేశ్వర్‌లో భక్త జనసందోహం



గుప్తేశ్వర్‌లో నేడు పూజలందుకుంటున్న శివలింగం



దూరప్రాంతాల నుంచి నడుచుకుంటూ వస్తున్న భోల్‌భం భక్తులు



సహాజ్య నిర్వహించిన సహాయ కేంద్రం



గుప్తేశ్వర్ బాటలో భోల్‌భం భక్తులు

చారిత్రక శివక్షేత్రం గుప్తేశ్వర్‌లో సోమవారం భక్తజన సందడి నెలకొంది. శ్రావణమాసం ఆఖరి సోమవారం సందర్భంగా భోల్‌భం భక్తుల సమారోహంతో పాటు వేలాది మంది భక్తులు తరలిరావడంతో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. శనివారం నుంచే సుదూర ప్రాంతాల నుంచి భోల్‌భం కావిళ్లతో భక్తులు గుప్తేశ్వర్‌కు చేరుకున్నారు. అనేక మంది కాలినడకన తరలివచ్చారు. వారికి పలు సంస్థల ప్రతినిధులు తాగునీరు, ఫలహారాలు అందించారు. ప్రాథమిక వైద్యసేవలు సైతం అందజేశారు. దాదాపు 70 వేలకుపైగా భక్తులు గుప్తేశ్వర్‌లో అపూర్వ శివలింగానికి పవిత్ర జలాలతో అభిషేకం చేశారు. -జయపురం

దేశాన్ని అగ్రగామిగా నిలుపుదాం

- వైజ్ఞానికతతో సంప్రదాయాలను పరిరక్షిద్దాం
- ఐఐటీ విద్యార్థులకు మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పిలుపు

భువనేశ్వర్:

నేటి వైజ్ఞానిక ఆధారిత యుగంలో భారతీయ విలువల పరిరక్షణకు యువతరం అంకిత భావంతో కృషి చేయాలని కేంద్ర విద్య, నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పిలుపునిచ్చారు. దేశాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్లాలనే సంకల్పంతో ముందుకు సాగాలని కోరారు. 2047 సంవత్సరం నాటికి సమృద్ధి భారతదేశం సాకారాని మన వంతు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. యువతలో దేశభక్తి భావాల్ని మెరుగుపరచి కర్తవ్య భావం పెంపొందించేందుకు ప్రతిఒక్కరు కృషి చేయాలన్నారు. స్థానిక ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) ఆధ్వర్యంలో సోమవారం బరుణై కొండ పాదపీఠం ప్రాంగణంలో జాతీయ స్థాయి మేరీ మట్టి మేరా దేశ్ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ముందుగా నిర్వాహక సంస్థ డైరెక్టరు ప్రొఫెసర్ శ్రీపాద కర్మల్కర్ అతిథులను ఆహ్వానించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఆజాదీ కా అమృత్ ఉత్సవంలో భాగంగా జాతి కోసం ప్రాణాలర్పించిన అమర వీరులకు నివాళులర్పించడం ఈ ప్రచార కార్యక్రమం ధ్యేయమన్నారు. విద్యార్థులంతా ఈ సామాజిక ఉద్యమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 200 ఏళ్ల క్రితం ఈ చారిత్రక భూమిలో బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాడిన ధైర్యమైన పాయికా ఉద్యమకర్తగా ప్రముఖ విప్లవకారుడు బక్సీ జగబంధు మహాపాత్రో పేరుగాంచారని గుర్తు చేశారు. పాయికా తిరుగుబాటులో ప్రాణత్యాగం చేసిన ధీరులైన ఉద్యమకారులకు మంత్రి నివాళులర్పించారు. వారి కుటుంబీకులను సత్కరించి అభినందించారు.

యువతతో ప్రతిజ్ఞ..

'2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చేసి, స్వయం ఆధారితంగా తీర్చిదిద్దుతామని మేము ప్రతిజ్ఞ చేస్తున్నాం. దాసత్వ మానసికత జాడ లేకుండా చేస్తాం. మన వారసత్వాన్ని పరిరక్షణతో గర్విస్తాం. ఐక్యతను బలోపేతం చేసి దేశాన్ని రక్షించే వారిని గౌరవిస్తాం. పౌరునిగా విధులను నిర్వర్తిస్తాం' అంటూ కార్యక్రమానికి హాజరైన అతిథులు, ప్రముఖులు, విద్యార్థులు, యువతతో మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సభాముఖంగా ప్రతిజ్ఞ చేయించారు.

అమృత కలశ యాత్ర..

స్థానిక బరుణై కొండ ప్రాంతం నుంచి అమృత కలశ యాత్ర నిర్వహించారు. కొండ ప్రాంతంలో మట్టితో అమృత కలశం నింపి యాత్ర చేపట్టారు. బరుణై ప్రాంతంలో సాహిద్ స్మృతి స్తంభం వద్ద అమర వీరులకు పుష్పాంజలి ఘటించారు. కేంద్ర మంత్రి ప్రారంభించిన ఈ యాత్రలో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. బరుణై నుంచి ఐఐటీ క్యాంపస్ కార్యక్రమ వేదిక వరకు ఈ ర్యాలీ కొనసాగింది. భారత దేశపు మ్యాప్ ఆకృతిలో విద్యార్థుల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



భారత దేశపు మ్యాప్ ఆకృతిలో విద్యార్థుల ప్రదర్శన



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న మంత్రి ధర్మేంద్ర ప్రధాన్



దివంగత పాయికా విప్లవకారుల కుటుంబీకులకు మంత్రి సత్కారం



మంత్రి ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

మౌలిక సౌకర్యాలు కల్పించాలి



సమస్యలు వింటున్న అదనపు కలెక్టర్ ప్రధాన్

రాయగడ: జిల్లాలోని చంద్రపూర్ సమితి సమావేశ మందిరంలో సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ రామేశ్వర్ ప్రధాన్ ఆధ్వర్యంలో వినతులు స్వీకరించారు. మౌలిక సౌకర్యాలే ప్రధాన సమస్యలుగా పలు గ్రామాల ప్రజలు అధికారులకు విన్నవించారు. మొత్తం 45 సమస్యలు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఆయా సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలక్టర్ రామేశ్వర్ ప్రధాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ముఖ్యవైద్యాధికారి డాక్టర్ లాల్‌మోహన్ రౌత్రాయ్, జిల్లా అదనపు ఎస్పీ విష్ణు చరణ్ పాత్రో, బీడీఓ అక్షయకుమార్ మల్లిక్, తహసీల్దార్ అశోక్ త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ పోటీల్లో అదరగొట్టారు



లాంగ్‌జంప్‌లో బంగారు పతకం సాధించిన కిశోర్ చంద్ర రథ్



పతకాలు సాధించిన ఒడిశా క్రీడాకారులు

పర్లాకిమిడి: భూటాన్‌లో జరుగుతున్న అంతర్జాతీయ సౌత్ ఆషియన్ ఫెడరేషన్ స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ – 2023 క్రీడా పోటీల్లో గజపతి జిల్లా ఎక్సైజ్ శాఖ విశ్రాంత ఎస్సై, క్రీడాకారుడు కిశోర్ చంద్ర రథ్ సత్తా చాటారు. వంద మీటర్ల పరుగులో స్వర్ణం, లాంగ్ జంప్‌లో స్వర్ణ పతకం సాధించారు. సోమవారం జరిగిన ఫైనల్స్‌లో ఒడిశా నుంచి 12మంది హాజరు కాగా, ముగ్గురు క్రీడాకారులు వివిధ పోటీల్లో బహుమతులు సాధించారు. కిశోర్‌చంద్రరథ్ గతంలో అనేక జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని పతకాలు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా కిశోర్‌చంద్రరథ్‌ను జిల్లా ఎక్సైజ్ శాఖ ఎస్పీ అభిరాం బెహరా, కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్ తదితరులు అభినందించారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి



పోలీస్ స్టేషన్ వద్ద మొక్కలు నాటుతున్న సిబ్బంది

రాయగడ: పర్యావరణ పరిరక్షణలో భాగంగా జిల్లా పోలీస్ యంత్రాంగం చర్యలు చేపట్టింది. అన్ని పోలీస్ స్టేషన్ల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. బొప్పాయి, నిమ్మ, మునగ వంటి 287 మొక్కలను నాటించినట్లు జిల్లా పోలీస్ కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. మొక్కల సంరక్షణ బాధ్యత కూడా పోలీస్ సిబ్బంది తీసుకునేలా ఎస్పీ వివేకానంద శర్మ ఆదేశాలు జారీ చేశారు.

పర్యవరణ మంచ్ ఆధ్వర్యంలో..

స్థానిక పర్యవరణ మంచ్ ఆధ్వర్యంలో గ్రామదేవత బురదల పోలమ్మ మందిరం ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మంచ్ ప్రతినిధులు జోగేశ్వర్‌దాస్, కె.కె.జెన్నా, బసంత కుమార్ ఉలక, మంజులా మినియాక, అప్పలస్వామి కద్రక, ఫారెస్టర్ గౌరి సాహు, బురదల పోలమ్మ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బార్లి జగన్‌మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

బారంగ్-ఖుర్దా రోడ్డు మధ్య.. మూడో రైలు మార్గం



నిర్మాణ దశలో బారంగ్ - ఖుర్దా రోడ్ మూడో రైలు మార్గం

- త్వరలో ప్రత్యక్ష సేవలు
- సీఆర్ఎస్ అనుమతి
- శరవేగంగా సాగుతున్న పనులు



అధికారుల పర్యవేక్షణలో నిర్మాణ పనులు

భువనేశ్వర్: బారంగ్, ఖుర్దా రోడ్ మార్గంలో 3వ రైలు లైను కోసం అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ నిర్మాణం పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇటీవలే పనులు ప్రారంభం కావడంతో పలు రైళ్ల రాకపోకలు ప్రభావితమయ్యాయి. అత్యధిక రైలు సేవల్ని రద్దు చేయగా ప్రధాన ప్రయాణికుల రైళ్లను దారి మళ్లించారు. ఈ నేపథ్యంలో పనుల వేగవంతంపై దృష్టి సారించారు. మంచేశ్వర్, భువనేశ్వర్ స్టేషన్ల మధ్య చివరి దశ పనులను రైల్వే భద్రతా కమిషనర్ సీఆర్ఎస్ పరిశీలించిన తర్వాత బారంగ్ – ఖుర్దారోడ్ మధ్య మూడవ రైల్వే లైను నిర్మాణం పనుల్ని ప్రారంభించారు. సీఆర్ఎస్ ఆమోదంతో ఈ పనుల్ని ప్రారంభించినట్లు తూర్పు కోస్తా రైల్వే తెలిపింది. మూడో లైను కొనసాగుతున్న రైలు మార్గంతో అనుసంధాన పరచడం అత్యంత కీలకమైన భద్రత సంబంధితమైన చర్యగా అధికారులు పేర్కొన్నారు.

ప్రయాణం సుఖమయం..

పనులు పూర్తయితే బారంగ్- ఖుర్దా రోడ్ మధ్య రైలు ప్రయాణం అత్యంత సుఖమయం అవుతుంది. నరాజ్-కటక్ మార్గం, పూరీ-బరంపురం వైపు నుంచి వచ్చి పోయే రైళ్లకు ఇబ్బందులు తొలగిపోతాయి. పనులు పూర్తి కావస్తుండటంతో కటక్, భువనేశ్వర్, ఖుర్దా రోడ్ మార్గంలో రైళ్ల రాకపోకలు యథాతథంగా పునరుద్ధరిస్తారు.

ముఖ్యమంత్రి నవీన్‌పట్నాయక్‌కు కృతజ్ఞతలు



పాండ్యన్‌తో మాట్లాడుతున్న ఈశ్వర్ పాణిగ్రాహీ, ఎమ్మెల్యే

కొరాపుట్: అవిభక్త కొరాపుట్ జిల్లాలో నివాసముంటున్న రొణ, మాలి కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్పిస్తున్నందుకు వారంతా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు సోమవారం కొరాపుట్ జిల్లాకు చెందిన బీజేడీ ముఖ్య నాయకులు భువనేశ్వర్‌లో నవీన్ నివాస్‌కు చేరుకున్నారు. ముఖ్యమంత్రి వ్యక్తిగత కార్యదర్శి కార్తికేయ పాండ్యన్‌తో సమావేశమయ్యారు. కొరాపుట్ జిల్లాలో ఈ రెండు జాతులకు చెందిన వారు సుమారు 50 వేల మంది ఉన్నారు. ఇటీవల జరిగిన ట్రైబల్ అడ్వైజరీ కమిటీలో వీరికి ఆదివాసీ హోదా ఇచ్చేందుకు సీఎం ఆమోదముద్ర వేశారు. అందుకు తగ్గ రాష్ట్ర అంగీకారాన్ని రాష్ట్రపతికి పంపించారు. ఈ నేపథ్యంలో త్వరలోనే వీరు ఆదివాసీ గుర్తింపు పొందనున్నారు. కార్యక్రమంలో కొరాపుట్ సెంట్రల్ కోఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు ఈశ్వర్ చంద్ర పాణిగ్రాహీ, కొరాపుట్ పార్లమెంట్ సభ్యుడు రమేష్ చంద్ర మజ్జి, ఎమ్మెల్యే రఘురాం పొడాల్, పొట్టంగి ఎమ్మెల్యే పీతం పాఢీ, లక్ష్మీపూర్ ఎమ్మెల్యే ప్రభు జానీ, కొరాపుట్ జెడ్పీ అధ్యక్షురాలు సస్మితా మెలకా, కొరాపుట్ ఎస్‌డీసీ చైర్మన్ చంద్రశేఖర్ మజ్జి, మాజీ ఎంపీ జిన్ను హిక్కా, కొరాపుట్ మున్సిపల్ చైర్మన్ లలిటెందె రంజన్ శెఠి, మాజీ ఎమ్మెల్యే కై లాష్ కులసిక, మాజీ ఎమ్మెల్యే ప్రఫుల్ల పంగి, భీమో హరిజన్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి తీవ్రగాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

పార్వతీపురంటౌన్: ఎదురెదురుగా వస్తున్న రెండు మోటార్‌బైక్‌లు ఢీకొన్న దుర్ఘటనలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదం కొమరాడ మండలంలోని కొత్తవలస గ్రామ సమీపంలో సోమవారం జరిగింది. జిల్లా ఆస్పత్రి అవుట్‌పోస్ట్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. కొమరాడ మండలం, గుమడ గ్రామానికి చెందిన బొట్టా తిరుపతి.. చిన ఖేర్జల గ్రామం నుంచి మోటార్‌బైక్‌పై వస్తుండగా విశాఖపట్నం జిల్లా, టి.ఆర్యాపురం మండలం, కొత్తాపల్లి గ్రామానికి చెందిన గంటమల్ల అప్పలరాజు మోటార్‌బైక్‌పై చినఖేర్జల వెళ్తుండగా కొత్తవలస గ్రామం దగ్గరకు వచ్చేసరికి వారి బైక్‌లు ఒకదానికొకటి బలంగా ఢీకొన్నాయి. దీంతో వారిద్దరికి తీవ్రగాయాలయ్యాయి. అప్రమత్తమైన స్థానికులు 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి క్షతగాత్రులను తరలించారు. ఇరువురి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం వారిని విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. ఈ ఘటనపై అవుట్‌పోస్ట్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

స్నానానికి వెళ్లి మృత్యువాత

వేపాడ: కాలువలో స్నానానికి దిగిన కానిస్టేబుల్ నెక్కళ్ల ప్రవీణ్‌కుమార్(35) మృతి చెందారు. ఈ విషాద ఘటన మండలంలోని కృష్ణారాయుడుపేటలో ఆదివారం సాయంత్రం జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. స్నానం చేసేందుకు కృష్ణారాయుడుపేట జంక్షన్ వద్ద ఉన్న రైవాడ కాలువ దగ్గరకు వెళ్లిన ప్రవీణ్‌కుమార్ కాలువలోకి దిగే క్రమంలో ప్రమాదవశాత్తు నాచుమొక్కలు ఎక్కువగా ఉన్న ప్రాంతంలోకి జారిపోయాడు. నాచుమొక్కలు కాళ్లకు చుట్టుకుపోవడంతో బయటకు రాలేక, ఊపిరాడక చనిపోయారు. అపస్మారక స్థితిలో ఉన్నప్పుడు అయనను కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా, అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారని వల్లంపూడి ఎస్ఐ రాజేష్ తెలిపారు. సోమవారం మృతుడి తండ్రి నెక్కళ్ల సత్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ప్రవీణ్‌కుమార్ విజయనగరం ఏపీ ఎస్పీ బెటాలియన్-5లో పనిచేస్తుండగా, ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కుక్కల దాడిలో రెండు ఆవులు మృతి

వంగర: మండలంలోని ఎం.సీతారాంపురంలో కుక్కల దాడిలో రెండు ఆవులు మృతి చెందగా, మరో రెండు ఆవుదూడలు గాయపడ్డాయి. ఈ ఘటన ఆదివారం అర్ధరాత్రి జరిగింది. గ్రామంలో విచ్చలవిడిగా సంచరిస్తున్న కుక్కలు రాత్రి అయితే చాలని పశువుల శాలల్లోని ఆవుదూడలు, ఆవులపై దాడికి ఎగబడుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటివరకు కుక్కల బారినపడి నాలుగు పశువులు మృతి చెందగా, 10 మూగజీవాల వరకు గాయపడ్డాయని తెలిపారు. ఈ విషయంపై బాధితులు బలగ సాయికుమార్, ముదిల పైడిరాజు, ఒమ్మి నాగయ్య, దుప్పాడ సింహాచలం సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. అలాగే కుక్కల బెడద తొలగించాలని కోరారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల సత్తా



సర్టిఫికెట్లతో కరాటే క్రీడాకారులు

విజయనగరం: జిల్లా స్థాయి కరాటే పోటీల్లో విజయనగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు సత్తాచాటారు. కోచ్ కానూరు సంతోష్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో మాట్లాడుతూ పోటీల్లో విజయనగరం జట్టుకు జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం లభించిందన్నారు. డ్రాగన్ పవర్ పంచ్ కరాటే డు-అసోసియేషన్ ఆధ్వర్యంలో కొత్తవలసలో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. పి.కుశ్వంత్, ఎస్.గీతిక్ వర్మ కుమిటీలో బంగారు, కాటాలో కాంస్య పతకం సాధించగా, పి.హేమంత్ కుమిటీలో కాంస్య పతకం, కాటాలో బంగారు పతకం దక్కించుకున్నారు. అలాగే ఎస్.కార్తీక్, బి.యశ్వంత్‌లు కుముటిలో రజతం, కాటాలో కాంస్య పతకాలు పొందగా, జె.నవీన్ నంద కుమిటిలో రజతం, కాటాలో కాంస్య పతకం సాధించారు. ఆర్.వంశీవరుణ్ రెండు విభాగాల్లోనూ రజత పతాకాలు సాధించారు. బి.శివశ్రీహర్ష, బి.షణ్ముఖ శ్రీకర్, ఎస్.జితేంద్ర రెండు విభాగాల్లోనూ కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. జిల్లా స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులను సత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎం.శశిభూషణరావు, ప్రిన్సిపాల్ సాయి దేవమణి, కెన్యూరియో కరాటే అసోసియేషన్ కోచ్ కె.సంతోష్‌కుమార్, అధ్యక్షుడు సుమన్‌లు అభినందించారు.

బ్రెయిన్ కేన్సర్‌తో గిరిజన విద్యార్థిని మృతి

గుమ్మలక్ష్మీపురం: బ్రెయిన్ కేన్సర్‌తో గిరిజన విద్యార్థిని హిమరిక ప్రమీల(13) విశాఖపట్నంలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి.. కొమరాడ మండలంలోని గాజులగూడకు చెందిన ప్రమీల గుమ్మలక్ష్మీపురం మండలం, రేగిడి గ్రామంలోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. ఈ నెల 13వ తేదీన జ్వరం రావడంతో పాఠశాల సిబ్బంది కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి, వైద్యసేవలు అందజేశారు. అయినా జ్వరం తగ్గకపోవడంతో మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడ కూడా నయం కాకపోవడంతో ఈ నెల 14వ తేదీన విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించగా, ప్రమీలకు బ్రెయిన్ ట్యూమర్ ఉన్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో శస్త్రచికిత్స చేసేందుకు వైద్యులు సిద్ధం కాగా, ప్రమీల శరీరం సహకరించడం లేదు. అలా చికిత్స అందిస్తుండగా, ఒకానొక దశలో ఊపిరి తీసుకోవడం ఇబ్బందిగా మారింది. ఈ క్రమంలో ఐసీయూకి తరలించి, ఆక్సిజన్ సదుపాయం కల్పించినా ఫలితం లేదని, చికిత్స పొందుతూ మృతి చెందిందని ఏటీడబ్ల్యూవో సురేష్‌కుమార్ తెలిపారు. విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

క్లుప్తంగా

ఆదిత్యుని ఆలయ అభివృద్ధికి రూ. లక్ష విరాళం



విరాళ చెక్కును ఈఓకు అందజేస్తున్న దాత ఉమామహేశ్వరరావు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ అభివృద్ధి కోసం విశాఖపట్నం వాస్తవ్యుడు మాడుగుల ఉమామహేశ్వరరావు (లండన్) తన తండ్రి సత్యలక్ష్మీనారాయణ జ్ఞాపకార్థం రూ.1,02,116 విరాళంగా అందజేశారు. ఈ మేరకు ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్‌కు సోమవారం ఉదయం విరాళ చెక్కును అందజేశారు. రూ.లక్షకు మించి విరాళమిచ్చిన దాతలకు పర్వదినాల్లో విశిష్ట దర్శనానికి డోనర్ పాస్‌ను ఇవ్వనున్నట్లుగా ఈఓ తెలిపారు.

మురపాకలో స్వచ్ఛ సర్వేక్షణ్ కేంద్ర బృందం పర్యటన



మురపాక హైస్కూల్‌ను పరిశీలిస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్ కేంద్రం బృందం

లావేరు: మండలంలోని మురపాక గ్రామంలో సోమవారం స్వచ్ఛ సర్వేక్షణ్ కేంద్రం బృందం సభ్యులు పర్యటించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ కేంద్రం బృందం పర్యవేక్షకుడు జి.మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో సభ్యులు మురపాక గ్రామంలో గల హైస్కూల్, పీహెచ్‌సీ, అంగన్‌వాడీ కేంద్రం, చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాన్ని, ఆలయాన్ని పరిశీలించారు. వాటి పనితీరును అడిగితెలుసుకున్నారు. వారితో పాటు మండల పంచాయతీ అధికారి వి.విశ్వేశ్వరరావు, సర్పంచ్ పెయ్యల నాగమణి, పంచాయతీ కార్యదర్శి కేవీ ప్రసాద్, పీపీఆర్సీ సిబ్బంది రాజేష్, మోసేష్, వైఎస్సార్ సీపీ నాయకుడు పెయ్యల లక్ష్మణరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఉన్నారు.

రైతుకు నెలకు రూ.50 వేలు ఆదాయం లక్ష్యం



మాట్లాడుతున్న ప్రకాష్

ఎచ్చెర్ల క్యాంపస్: ఎకరా సాగు చేసే రైతుకు నెలకు రూ.50వేలు ఆదాయం వచ్చేలా చేయడమే తమ లక్ష్యమని ప్రకృతి వ్యవసాయశాఖ రీజనల్ టిమాటిక్ లీడ్ కె.ప్రకాష్ అన్నారు. ఎచ్చెర్ల సాంకేతిక శిక్షణ కేంద్రంలో జిల్లా వ్యవసాయశాఖ, వ్యవసాయ శాస్త్ర వేత్తల కోర్సు-ప్రాంతీయ శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి నిర్వహించిన నాలుగు రోజుల శిక్షణ సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు యాజమాన్య ఖర్చులు తగ్గేలా ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఎకరా ఉద్యాన వన పంటలు, కూరగాయలు సాగు చేస్తే నెలకు కనీసం ఆదాయం రూ. 25 వేలు నుంచి రూ. 50 వేలు గరిష్ఠంగా వస్తుందని అన్నారు. రైతు భరోసా కేంద్రం పరిధిలో ఒక ఆదర్శ రైతును తీసుకొని వ్యవసాయ శాస్త్ర వేత్తగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ రైతుకు నాలుగేళ్ల పాటు శిక్షణ అందిస్తామని వివరించారు. కార్యక్రమంలో ప్రాంతీయ సాంకేతిక అధికారి హేమసుందర్, శాస్త్రవేత్త డాక్టర్ నీరజ, అధికారులు ధనుంజయ్, సనత్, మానస, చంద్రబాను, యశశ్రీ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



వెంకటరావు ఫైల్

సోంపేట: మండలంలోని కర్తలిపాలెం గ్రామానికి చెందిన పండూరు వెంకటరావు (57) సోమవారం విద్యుత్ షాక్‌తో మృతి చెందారు. వెంకటరావు సోమవారం సాయంత్రం తన ఇంటి గోడలను నీటితో తడుపుతుండగా, మరమ్మతు చేసిన ఉన్న విద్యుత్ లైన్ల వల్ల షాక్ కొట్టింది. దీంతో అక్కడికక్కడే ఆయన మృతి చెందారు. ఈయన వైఎస్సార్ సీపీ కార్యకర్తగా పార్టీకి సేవలు అందించేవారని సర్పంచ్ పొందూరు గున్నయ్య తెలిపారు. వెంకటరావుకు భార్య హేమావతి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. భార్య హేమావతి ఫిర్యాదు మేరకు బారువ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య

కోటబొమ్మాళి: మండలంలోని హరిశ్చంద్రపురం రైల్వేస్టేషన్ సమీపంలో జాతీయ రహదారి రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జి కింద ఆదివారం రాత్రి సంతబొమ్మాళి మండలం మండలం గోవిందపురానికి చెందిన సీరపు శ్రీనివాస్ (34) ఆత్మహత్య చేసుకున్నాడని పలాస రైల్వే ఎస్ఐ షరీఫ్ తెలిపారు. రైలు కింద పడడంతో మృతుడి తల, శరీర భాగాలు ఛిన్నాభిన్నమయ్యాయని, అతని జేబులోని సెల్‌ఫోన్, ఆధార్ కార్డు ఆధారంగా సీరపు శ్రీనివాస్‌గా రైల్వే పోలీసులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశామని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షరీఫ్ తెలిపారు.

ఆదిత్యునికి అదనపు ఆదాయం



బంగారు వస్తువులను ఎస్‌బీఐ అధికారులకు అందజేస్తున్న అధికారులు, పాలకమండలి సభ్యులు (ఫైల్)

- గోల్డ్ బాండ్ స్కీం కింద కానుకల బంగారాన్ని కడ్డీలుగా మార్చే ప్రక్రియకు శ్రీకారం
- ఎస్‌బీఐ చేతికి 7 కేజీల 215 గ్రాముల బంగారం

అరసవల్లి: ఆలయ హుండీల్లో భక్తులు మొక్కుల చెల్లింపులుగా వేసిన బంగారు, వెండి వస్తువులు ఎట్టకేలకు వినియోగంలోకి రానున్నాయి. ఏళ్ల తరబడి వినియోగానికి వీలుకాని వస్తువులన్నింటినీ ఇప్పుడు 'గోల్డ్ బాండ్ స్కీం' (జీబీఎస్) పేరిట కడ్డీలుగా మార్చే కీలక ప్రక్రియను దేవదాయ శాఖ చేపట్టింది. ఈ మేరకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ జీబీఎస్ పేరిట బంగారు, వెండి వస్తువులను కడ్డీలుగా చేసి విశాఖపట్నం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో భద్రపరిచి, తద్వారా వచ్చిన వడ్డీ నగదుతో ఆలయాల నిర్వహణకు ఖర్చు చేసేలా ప్రణాళిక అమలు చేయనున్నారు. ఇక్కడ స్వామి మూలవిరాట్టుకు, ఉత్సవమూర్తుల అలంకరణలకు నిత్యం, పర్వదినాల్లో వినియోగించే ఆభరణ వస్తువులను మినహాయిస్తూనే.. వినియోగించని వస్తువులన్నీ ఇలా ఈ స్కీమ్ ద్వారా కడ్డీలుగా మార్చనున్నారు. అయితే ప్రస్తుతానికి బంగారు వస్తువులను మాత్రమే సంబంధిత స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారికి అప్పగించారు. తర్వాత వెండి వస్తువులను అప్పగించేలా సన్నాహాలు చేస్తున్నారు.

7 కిలోల 215 గ్రాముల బంగారాన్ని..

అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామికి మొత్తం సుమారు 18 కిలోల వరకు బంగారు వస్తు ఆభరణాలున్నాయి. అయితే ఇందులో మూలవిరాట్టు, ఉత్సవమూర్తులకు నిత్యాలంకరణకు వినియోగించేందుకు 10 కిలోల బంగారాన్ని ఆలయ అధికారులు, అర్చకుల సంరక్షణలోనే బ్యాంకు లాకర్లలో ఉంచారు. మిగిలిన, వినియోగించని బంగారం 7 కిలోల 215 గ్రాముల బంగారు వస్తువులను కడ్డీలుగా మార్చనున్నారు. ఈ మేరకు ఈ నెల 18న దేవదాయ శాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ ఎంవీ సురేష్‌బాబు, జ్యూయలరీ వెరిఫికేషన్ ఆఫీసర్ ఏవీ దుర్గా భవానీల సమక్షంలో మొత్తం 293 రకాల వస్తువులను భద్రంగా సీల్డు ప్యాక్‌లో జీబీఎస్ క్రింద స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా డిప్యూటీ మేనేజర్ డి.కుమార్, చీఫ్ మేనేజర్ సుధీర్‌కుమార్‌లకు అప్పగించారు.

మంత్రి ధర్మాన సూచనల మేరకే..

అరసవల్లి ఆలయంలో భక్తుల నుంచి వచ్చిన మొక్కులను అలా బ్యాంకుల్లో చిల్లర వస్తువులుగా వదిలేయడం కంటే గోల్డ్ బాండ్ స్కీంలో పెట్టాలని రాష్ట్ర రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఇటీవలే స్థానిక ఆలయ అధికారులకు, పాలకమండలి సభ్యులకు సూచనలు చేశారు. ఈమేరకు వినియోగంలో లేని బంగారాన్ని ఇలా జీబీఎస్ ద్వారా భద్రపరచడంతో వడ్డీ ద్వారా కూడా ఆలయానికి కొంత నగదు వస్తుందని సూచించారు. దీంతో ఇటీవల ఏర్పడిన కొత్త పాలకమండలి సభ్యులు దీనిపై పలుమార్లు చర్చించారు. ఎట్టకేలకు ట్రస్ట్ బోర్డు సభ్యుల చొరవతో వినియోగించని బంగారం కడ్డీలుగా మార్చడంతో పాటు ఆదాయ వనరుగా మారనుంది. విశాఖపట్నంలో వీటిని కరిగించి కడ్డీలుగా తయారు చేసి విశాఖలోనే ఎస్‌బీఐలో భద్రపరచనున్నారు. ఈమేరకు బంగారాన్ని పాలకమండలి సభ్యులు మండవిల్లి రవి, డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు, ద్వారపు అనూరాధ, లుకలాపు గోవిందరావు, జె.శ్రీనివాస్ చేతుల మీదుగానే అధికారులకు అప్పగించారు.

భద్రతాపరంగా మంచి నిర్ణయం



దేవదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం అరసవల్లి ఆలయంలో వినియోగించని బంగారం, వెండి వస్తువులను కడ్డీలుగా మార్చి ఎస్‌బీఐలో భద్రపరిచే జీబీఎస్ స్కీం అమలు చాలా మంచి నిర్ణయం. ముఖ్యంగా చిన్న చిన్న వస్తువులు అలా ఉంటే ఎప్పటికైనా ఇబ్బందికరంగానే ఉంటుంది. అలాంటి విలువైన వస్తువులను కడ్డీలుగా మార్చడంతో భద్రతాపరంగా కూడా చాలా మంచి నిర్ణయం. త్వరలో వెండిని కూడా కడ్డీలుగా మార్చేస్తాం.

– వి.హరిసూర్యప్రకాష్, ఆలయ ఈఓ

మంత్రి ఆలోచన మేరకు



అరసవల్లి ఆలయ అభివృద్ధికి మంత్రి ధర్మాన పర్యవేక్షణలోనే ఎన్నో కార్యక్రమాలు చేశాం. అలాగే ఆలయంలో వినియోగించని భక్తుల బంగారు వెండి వస్తు కానుకలను జీబీఎస్ స్కీమ్‌లో చేర్చాలని మంత్రి ధర్మాన ప్రసాదరావు సూచించారు. ఆయన ఆలోచన, సూచనల మేరకు ప్రధానార్చకులు శంకరశర్మ, ఈవోలతో చర్చించి.. వినియోగించని 293 వస్తువులను గుర్తించాం. వాటిని కడ్డీగా మార్చడంతో ఆలయానికి బ్యాంకు వడ్డీ కూడా వస్తుంది.

– మండవిల్లి రవి, పాలకమండలి సభ్యుడు.

ఆ కుటుంబాలకు అండగా ఉంటాం: ఎస్పీ



సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ రాధిక, పక్కనే అడిషనల్ ఎస్పీ తిప్పేస్వామి

శ్రీకాకుళం క్రైమ్ : విధి నిర్వహణలో ఉంటూ అనారోగ్యం, ప్రమాదాలకు గురై మరణించిన పోలీసుల కుటుంబాలకు అండగా ఉంటామని ఎస్పీ జీఆర్ రాధిక అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం సాయంత్రం బాధిత కుటుంబసభ్యులతో సమావేశం నిర్వహించారు.

అర్హులైన కుటుంబ సభ్యులకు ఉద్యోగం త్వరితగతిన వచ్చేటట్లు చేయాలని, మంగళగిరి కార్యాలయంలో ఉద్యోగ ఖాళీలు ఎక్కువగా ఉన్నాయని, ఎవరైనా ఇష్టపూర్వకమైతే పోలీసు ప్రధాన కార్యాలయానికి ప్రతిపాదనలు పంపిస్తామని, జిల్లాలో ఉద్యోగ ఖాళీలు తక్కువగా ఉన్నాయని, అందుచేత ఉద్యోగం ఇక్కడ పొందేందుకు కొంత ఆలస్యం జరుగుతుందని అన్నారు. ఇప్పటికే కొంతమంది వివరాలు కలెక్టర్ కార్యాలయానికి పంపించడం జరిగిందని వీటిపై పోలీసు కార్యాలయ సిబ్బంది ఉత్తరప్రత్యుత్తరాలు జరిపించాలని, ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలన్నారు.

'నేత్రదానంతో అంధత్వాన్ని రూపుమాపుదాం'



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, జేసీ నవీన్

శ్రీకాకుళం కల్చరల్: నేత్రదానంతో అంధత్వాన్ని రూపు మాపవచ్చని, ప్రజలు నేత్రదానం చేసేందుకు ముందుకు రావాలని సంయుక్త కలెక్టర్ ఎం.నవీన్ పిలుపునిచ్చారు. రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో 38వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ర్యాలీని జెడ్పీ వద్ద ఆయన జెండా ఊపి ప్రారంభించారు. వచ్చేనెల 8వరకు జిల్లా వ్యాప్తంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నేత్రదానంపై అందరికీ అపోహలు ఉన్నాయని, నేత్ర సేకరణ అంటే కేవలం కార్నియా మాత్రమే సేకరిస్తారని అన్నారు. ఇప్పటి వరకు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో 486 మంది దాతల ద్వారా 777 మందికి నేత్రాలను అమర్చి వారికి కంటి చూపు ప్రసాదించడం జరిగిందని తెలిపారు. నేత్రదానం చేసేందుకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో లభించే నేత్రదాన ప్రతిజ్ఞా పత్రంలో తమ పేరు, వివరాలను నింపి అందించాలని కోరారు. కార్యక్రమంలో సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ మీనాక్షి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ త్రినాధరావు, సెట్‌శ్రీ సీఈఓ బీవీ ప్రసాదరావు, పెంకి చైతన్యకుమార్, కె.సత్యనారాయణ, చిన్మయరావు, ఆప్తాలమిక్ అసిస్టెంటు ఎంఆర్‌కెదాస్, రాజశేఖరరెడ్డి సీనియర్ సిటిజన్లు, యూత్ రెడ్‌క్రాస్, ప్రభుత్వ మహిళా కళాశాల, ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికలు

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం గ్రామీణ మండలం సానివాడలో తారక్ బాల్ బ్యాడ్మింటన్ అకాడమీ వేదికగా సెప్టెంబర్ 2, 3వ తేదీల్లో జిల్లాస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు శ్రీకాకుళం జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అధ్యక్ష, కార్యదర్శులు కోత పూర్ణచంద్రరావు, పి.వి.జి. మురళీకృష్ణంరాజులు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ బాల, బాలికల విభాగాల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని వారు స్పష్టం చేశారు. ఆసక్తి, అర్హత కలిగిన క్రీడాకారులు 2వ తేదీ(శనివారం) ఉదయం 10గంటలకు ఆధార్ కార్డు, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని కార్యనిర్వాహక కార్యదర్శి పి.అజయకుమార్ తెలిపారు. మరిన్ని వివరాలకు సహాయ కార్యదర్శి ఎం.మధుసూధనరావు ఫోన్ నంబర్ 80085 45048ను సంప్రదించాలని కోరారు.

ఉద్దానంలో ఎలుగు హల్‌చల్



హల్ చల్ చేస్తున్న ఎలుగు

వజ్రపుకొత్తూరు రూరల్: బాతుపురంలో సోమవారం ఉదయం ఎలుగు ఇళ్లలోకి ప్రవేశించి భయపెట్టింది. కొంత మంది స్థానికులు ఎలుగును తరమడంతో తోటలోకి వెళ్లిపోయింది. అయితే తోటకు వెళ్లే రైతులు, రోడ్లపై ప్రయాణించే ప్రయాణికులు సైతం భయాందోళన చెందుతున్నారు.

భవనం స్లేడ్ కూలి ఇద్దరికి గాయాలు

గార: మండలంలోని చినతూలుగు గ్రామంలో సోమవారం పాత ఇంటిని కూల్చివేస్తున్న ఘటనలో ఇద్దరు కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. కె.సైరిగాం గ్రామానికి చెందిన దీర్ఘాసి రాము, గంగాధర్‌లపై స్లేడ్ భాగం పడిపోవడంతో కాళ్లకు గాయాలయ్యాయి. రాముకు కుడికాలు విరిగిపోవడంతో పాటు తలకు గాయమైంది. గంగాధర్‌కు కుడికాలికి తీవ్రగాయంతో పాటు ఎడమ చెయ్యి విరిగింది. వీరిద్దరినీ 108 వాహనంలోనే సిబ్బంది హరీష్, నారాయణరావులు అత్యవసర చికిత్సను అందజేశారు. అనంతరం రిమ్స్‌కు తరలించారు.

న్యాయవాదులకు హెల్త్ కార్డులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: న్యాయవాదులకు హెల్త్ కార్డులను జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు సోమవారం పంపిణీ చేశారు. జిల్లా బార్ అసోసియేషన్ భవనంలో జరిగిన కార్యక్రమంలో సూర్యారావు మాట్లాడుతూ గ్రూప్ మెడీ క్లెయిమ్ అండ్ పర్సనల్ యాక్సిడెంట్ పాలసీలు 2023–24 సంవత్సరానికి న్యాయవాదులకు వర్తిస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బార్ కౌన్సిల్, ప్రభుత్వ గ్రాంటు కింద ప్రత్యేక కమిటీ 2023–24 సంవత్సరానికి న్యాయవాదులకు గ్రూపు మెడీ క్లెయిమ్, వ్యక్తిగత ప్రమాదాలకు ఈ కార్డును వినియోగించుకోవచ్చని తెలిపారు. 2024 జూలై 4 వరకు ఈ పాలసీ అమలులో ఉంటుందని తెలిపారు. సుమారు 100 మంది హెల్త్ కార్డులు అందజేశారు.

లారీ బోల్తా



కొత్తపల్లి సమీపంలో బోల్తా పడిన లారీ

మందస: మండలంలోని కొత్తపల్లి గ్రామం సమీపంలోని జాతీయ రహదారిపై సోమవారం ఓ లారీ బోల్తా పడింది. హైదరాబాద్ నుంచి ఒడిశా వైపు పంచదార లోడుతో వెళ్తున్న ఈ లారీ కొత్తపల్లి బ్రిడ్జి వద్దకు చేరుకోగానే అకస్మాత్తుగా పొలాల్లోకి దూసుకెళ్లింది. పొలాల్లో ఉన్న రైతులు, పాదచారులు భయభ్రాంతులై పరుగులు తీశారు. ఈ సమయంలో లారీ బోల్తా పడి, నిలిచిపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న జాతీయ రహదారి అంబులెన్స్ సంఘటనా స్థలానికి చేరుకుంది. డ్రైవర్, క్లీనరుకు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో సిబ్బంది వెనుతిరిగారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

21 కిలోల గంజాయితో ఇద్దరు అరెస్టు



రంపఖాన చెక్‌పోస్ట్ వద్ద స్వాధీనం చేసుకున్న గంజాయితో సిబ్బంది

మెళియాపుట్టి: మండలంలోని గొప్పిలి గ్రామ సమీపంలోని రంపఖానా చెక్‌పోస్టు వద్ద సోమవారం సాయంత్రం 21 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. టెక్కలి ఎస్ఈబీ సీఐ అనిల్ కుమార్ తెలిపిన వివరాల మేరకు.. పలాస టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, టెక్కలి ఎస్ఈబి సిబ్బంది సంయుక్తంగా చెక్‌పోస్ట్ వద్ద నిఘా ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తుండగా.. ఇద్దరు వ్యక్తులు బ్యాగులతో అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు బ్యాగులను తనిఖీ చేశారు. అందులో కిలోల ఎండు గంజాయి ఉన్నట్లు గుర్తించారు. ఒడిశా ఛెల్లిగొడా నుంచి బీహార్ రాష్ట్రం పాట్నాకు గంజాయిని తీకెళుతున్నట్లు తెలిపారు. ఇద్దరు వ్యక్తులపై కేసునమోదు చేసి టెక్కలి కోర్టులో హాజరుపరచినట్లు తెలిపారు.

తేట తెలుగు.. బతుకు వెలుగు



జి.సిగడాం: మోడల్ పాఠశాలో 200 వందల మంది కవుల చిత్రపటాలతో ఏర్పాటు చేసిన తెలుగు

- నేడు తెలుగు భాషా దినోత్సవం

అప్పటి వరకు ఆకాశయానం చేస్తున్న అక్షరం తొలిసారిగా నేలకు దిగింది. ఉత్కృష్ట గ్రంథాల్లోని పద బంధాలే సాహిత్యంగా పరిగణిస్తున్న కాలంలో.. సామాన్యుడి కవితా సామర్థ్యం కూడా సాహిత్యమే అని నిరూపితమైంది. పండితులకే పరిమితమైన తేట తెలుగు ఊట.. పామరుడి రచనా దాహాన్ని కూడా తీర్చింది. గిడుగు రామ్మూర్తి పంతులు చేసిన పోరాటం అమ్మ భాషను అందరికీ చేరువ చేసింది. నేడు తెలుగు భాషా దినోత్సవం. తల్లి నేర్పిన తేట తెలుగు పదాలకు కిరీటధారణ జరిగిన రోజు ఇది. గ్రాంథిక సంకెళ్లను తెంచుకుని తెలుగు పదాలన్నీ రథాలు కట్టుకుని ఇంటింటికీ వచ్చిన తేదీ ఇది. కార్మికుడి నినాదం కూడా కావ్య గౌరవం పొందిన అపురూప సమయమిది.

– కవిటి, ఇచ్ఛాపురం రూరల్, శ్రీకాకుళం



జి.సిగడాం: ఆదర్శపాఠశాలో జాతీయ క్రీడా దోనోత్సవం సందర్భంగా విద్యార్థులు చేసిన విన్యాసం

తెలుగు వెలుగుతోంది. ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్‌గా కీర్తి పొందిన మన అమ్మ భాష ఆంగ్ల ఆధిపత్య కాలంలోనూ తన ఉనికికి ఘనంగా చాటుకుంటోంది. శ్రీకాకుళం జిల్లాకు చెందిన గిడుకు వెంకటరామమూర్తి పంతులు కృషి వలనే తెలుగు భాష వ్యాప్తి చెందింది. జిల్లాలోని శ్రీముఖలింగం సమీపంలోని పర్వతాలపేట గ్రామంలో 1863 ఆగస్టు 29న గిడుగు వెంకటరామమూర్తి జన్మించారు. ఆయన గ్రాంథిక భాషలో ఉన్న తెలుగును వాడుక భాషలోకి తీసుకువచ్చేందుకు విశేష కృషి చేశారు. ఇందుకు గుర్తింపుగానే ఆయన పుట్టిన రోజు ఆగస్టు 29వ తేదీన తెలుగు భాషా దినోత్సవం జరుపుకుంటున్నారు. బరంపురం రాజుల ఆస్థానం నుంచి రాజమహేంద్రవరంలో కొలువు వరకు ఆయన వ్యావహారిక భాషా ఉద్యమాన్ని ముందుండి నడిపించారు. తెలుగును సరళం చేసి భావి తరాలకు మంచి చేశారు.

సాహితీ యజ్ఞం

సాహిత్య సంపదకు నిలయమైన శ్రీకాకుళం జిల్లాలో అనేక సంఘాలు, సాహితీ సంస్థలు తెలుగును కాపాడుకుంటున్నాయి. ముఖ్యంగా తెలుగు రచయితల వేదిక(తెరవే), విశ్వసాహితీ, అభ్యుదయ రచయితల వేదిక, సుమిత్ర కళా సమితీ, రాజాం రచయితల వేదిక, అభ్యుదయ రచయితల సంఘం(అరసం), జనజాగృతి సాహితీ సంస్థ, లలిత కళా రంజనీ సంఘం, శ్రీశ్రీ కళావేదిక, ఈవేమన కవితా నిలయం. సాహితీ స్రవంతి, భారతీ సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ, సాహితీ కిరణాలు, కళింగసీమ సాహిత్య సంస్థ, ఉద్దానం సాహితీ సాంస్కృతిక వేదికలు తెలుగు భాష కోసం తమ వంతు కృషి చేస్తున్నాయి. ఈ సంస్థలు కవి సమ్మేళనాలు, పుస్తకావిష్కరణలు, సమావేశాలు, సాహిత్య గోష్టిలతో తెలుగు వెలుగులు నింపుతున్నాయి. శతాధిక కవులున్న సిక్కోలులో కవిత, పద్యం, కథ, మణిపూసలు, గేయాలు, వ్యాసాలు తదితర ప్రక్రియలో తమదైన శైలిలో రచనలు చేయడంతో పాటుగా పుస్తకాలు ముద్రిస్తూ రాష్ట్రంలోనే ప్రత్యేకతను చాటుతున్నారు.

తెలుగు కావ్య భాష



తెలుగు కావ్యభాష. ప్రస్తుత సమాజంలో తెలుగు భాషకు ఆదరణ పెంచుతున్న సినిమా సాహిత్యం వ్యావహారిక భాషతో మమేకమైంది. గ్రాంథిక, వ్యావహారికాలు జోడు గుర్రాల్లా ముందుకు సాగాలి.

– వంధి ఢిల్లీశు, సంస్కృతాంధ్ర పండితులు, రిటైర్డ్ స్కూల్ అసిస్టెంట్, రాజపురం, కవిటి మండలం.

మాతృభాషను కాపాడాలి



తెలుగు మాతృభాషను ప్రతి ఒక్కరూ గౌరవించాలి. జిల్లాకు చెందిన గిడుగు వెంకటరామమ్మూర్తి తెలుగు భాషను వ్యవహారిక భాషగా చేయటం తెలుగువారి అదృష్టం. ఆయన చేసిన కృషి వలనే వ్యవహారిక భాషంలో రచనలు జరుగుతున్నాయి.

– భాస్కరభట్ల శ్రీరామ్మూర్తి, పండితులు

విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు



విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందజేస్తున్న డైరెక్టర్ పెద్దాడ జగదీశ్వరరావు

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు సాంకేతిక ప్రగతిని అందిపుచ్చుకోవాలని శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) శ్రీకాకుళం క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు అన్నారు. ఎస్ఎం పురం క్యాంపస్‌లో సోమవారం విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యా పరంగా ల్యాప్‌టాప్‌లు వినియోగించాలని సూచించారు. ఆన్‌లైన్ శిక్షణలకు సైతం ల్యాప్‌టాప్‌లు ఉపయోగపడతాయని అన్నారు.

బడిలో కుల, మత ప్రస్తావన వద్దు

శ్రీకాకుళం అర్బన్: విద్యాలయాల్లో కుల, మత ప్రస్తావనలు తీసుకువస్తే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం తెలిపారు. ఈ మేరకు సోమవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల వైఎస్సార్ జిల్లా బుకాయపల్లిలో జరిగిన అన్యమత ప్రచారంతో పాటు మరిన్ని జిల్లాల స్కూళ్ల ఉపాధ్యాయులు, సిబ్బందిపై ఆధారాలతో కూడిన ఫిర్యాదులు అందుతున్నాయని పేర్కొన్నారు. సున్నిత మనస్కులైన విద్యార్థులకు విద్యతో పాటు నీతి, న్యాయం, నైతిక విలువలు, సేవా తత్పరతను పెంపొందించే విధంగా ఉపాధ్యాయులు, సిబ్బంది తర్ఫీదునివ్వాలని సూచించారు. అలా కాకుండా కేవలం మత సంబంధిత అంశాలకు ప్రాధాన్యతనిచ్చి ఆచారాలు, సంస్కృతి, సాంప్రదాయాలకు ఇబ్బంది కల్గించే విధంగా ప్రవర్తిస్తూ వారి మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని అన్నారు. అన్యమత ప్రచారం చేస్తున్నట్టు విద్యార్థులు, వారి తల్లిదండ్రుల దృష్టికొస్తే a prc pcr2018@f-mai .com కు ఫిర్యాదులందిస్తే కమిషన్ సత్వరమే స్పందించి చర్యలు చేపడుతుందని తెలిపారు.

పురాతన విగ్రహాలు లభ్యం

వంశధార గొట్టా బ్యారేజీలో ఎగువ ప్రాంతంలో సోమవారం చేపల వేటకై వెళ్లిన మత్స్యకారులకు పురాతన విగ్రహాలు లభ్యమయ్యాయి. వినాయకుడు, లక్ష్మీదేవి, రాగి విగ్రహాలు లభ్యమయ్యాయి. వాటిని స్థానిక గొట్టా పోలమ్మ తల్లి ఆలయంలో ఉంచినట్లు వారు తెలిపారు.

– హిరమండలం



వంశధార గొట్టా బ్యారేజీలో లభ్యమైన విగ్రహాలు

శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి సీట్ల కేటాయింపు పూర్తి

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) క్యాంపస్‌లో పూర్తిస్థాయి సీట్లు కేటాయింపు పూర్తిచేశారు. ప్రారంభంలో జూలై 24న శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం తుది విడత కౌన్సెలింగ్ నూజివీడు క్యాంపస్‌లో నిర్వహించారు. 1100 సీట్లకు మొత్తం ప్రవేశాలు కల్పించారు. అందరు విద్యార్థులకు వసతి గృహం సీట్లు కేటాయించినట్లు డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు చెప్పారు.

31న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

అరసవల్లి: జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈనెల 31న ఉదయం 10 గంటల నుంచి స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లుగా జెడ్పీ సీఈఓ ఆర్.వెంకట్రామన్ తెలియజేశారు. ఉదయం 10 గంటల నుంచి 2వ, 11 గంటలకు 4వ, మధ్యాహ్నం 12 గంటలకు 7వ, మధ్యాహ్నం ఒంటి గంటకు 1వ, అలాగే మధ్యాహ్నం 3 గంటలకు 6వ, సాయంత్రం 4 గంటలకు 3వ, 5 గంటలకు 5వ స్థాయీ సంఘ సమావేశాలు జరుగుతాయని, సంబంధిత ప్రజాప్రతినిధులు, జెడ్పీటీసీలు, జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.